# కోరుట్లలో కారు జోరు



కోరుట్లలో ఆటోలో కూర్చుని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల విస్తృత ప్రచారం
- తన తండ్రి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి ఇంటింటికీ
- వీధివీధినా ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు
- బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి: సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, అక్టోబర్ 19: కోరుట్లలో బీఆర్ఎస్ హవా కొనసాగుతున్నది. పల్లె, పట్టణాల్లో ధూం ధాం ప్రచారం చేస్తున్నది. ప్రతిపక్షాలకు అందనంత దూరంలో శరవేగంగా వార్డులను చుట్టేస్తున్నది. అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకూ మద్దతు పెరుగుతున్నది. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. మీ వెంటే ఉంటామంటూ స్పష్టం చేస్తున్నారు.

### అలుపెరుగని ప్రచారం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కలిసి గురువారం కోరుట్ల పట్టణంలో కలియదిరిగారు. అంతకుముందు అష్టలక్ష్మీ ఆలయంలో డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే పూజలు చేసి, అర్చకుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. కోరుట్ల కొత్త బస్టాండు నుంచి పాత బస్టాండు మీదుగా నంది చౌరస్తా దాకా దుకాణాదారులు, వ్యాపారస్తులను ప్రత్యక్షంగా కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారస్తులు ఎమ్మెల్యే, సంజయ్‌కు స్వాగతం పలికారు. నుదుట తిలకం దిద్ది దుకాణంలోనికి ఆహ్వానించారు. కోరుట్ల పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చేసిన కృషిని వారు అభినందించారు. ఈ తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తన కొడుకు సంజయ్‌ని ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు.

### అభివృద్ధిని చూసి ఓటేయండి: సంజయ్ కల్వకుంట్ల

'ఇన్ని రోజులు ప్రతిపక్ష నాయకులు ఎటు పోయారు. ఇటు వైపు కన్నెత్తి అయినా చూశారా..? ఎన్నికలు వచ్చాయని మళ్లీ ప్రజల మధ్యకు వస్తూ, అలవికాని హామీలు ఇస్తూ ఓట్ల కోసం పాకులాడుతున్నరు. వారిని నమ్మితే మోసపోతమని' బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్‌తోనే సబ్బండ వర్గాలకు మేలు జరుగుతుందని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం రాక ముందు జరిగిన అభివృద్ధి, తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన అభివృద్ధి మధ్య తేడాను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా సర్పంచ్‌ల ఫోరం గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, బీఆర్ఎస్ మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీం, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### ప్రచారంలో సంజయ్ వైద్య సేవలు

కోరుట్లలో ఓ వైపు ప్రచారం చేస్తూనే, మరోవైపు ప్రజలకు వైద్య సేవలందిస్తూ ప్రజల మనసును చూరగొన్నారు సంజయ్ కల్వకుంట్ల. స్వతహాగా వెన్నెముక శస్త్ర నిపుణుడైన సంజయ్, ప్రచారంలో తన వద్దకు వచ్చిన పలువురి ఎక్స్‌రేలు పరీక్షించి అవసరమైన వారికి మందులు రాసిచ్చారు. ఆరోగ్య నియమాలు పాటించాలని సూచనలు చేశారు. బిజీ షెడ్యూల్‌లోనూ నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సంజయ్‌ని బాధితులు చల్లంగా ఉండాలని ఆశీర్వదించారు.



# నేను మీ బిడ్డను

జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎం సంజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

- మరోసారి మీ దీవెనలు అందించండి
- జగిత్యాలను మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎం సంజయ్ కుమార్
- జిల్లా కేంద్రంలో ప్రచారం

జగిత్యాల, అక్టోబర్ 19: 'నేను మీ బిడ్డను. ఇక్కడి ప్రజల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన వ్యక్తిని. మరోసారి మీ దీవెనలు అందించండి. మీకు అండగా ఉంటా. జగిత్యాల నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుతా' అని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని 29, 30వ వార్డుల్లో తన సతీమణి రాధికతో కలిసి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వృద్ధులు, యువకులు, మైనార్టీలను కలిశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. కాగా, ఎమ్మెల్యేకు మద్దతుగా ఎమ్మెల్యే సతీమణి రాధిక ప్రచారం చేశారు. మంచినీళ్ల బావి సమీపంలోని వార్డులో ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తుండగా, అక్కడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక కౌన్సిలర్ పంబాల రామ్ కుమార్, 30వ వార్డు ఇన్‌చార్జి దుమాల రాజ్ కుమార్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



అవ్వతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక

# స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రత

- అన్నిరకాల వసతులు కల్పించాలి
- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



జగిత్యాల వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు అన్ని వసతులు కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి మినీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, వీఆర్‌కే కాలేజీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించి ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాలను, కోరుట్లకు సంబంధించి కోరుట్ల ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాలను గురువారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. స్ట్రాంగ్ రూంలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని పనులు చేపట్టాలని, సీసీ కెమెరాలు, విద్యుత్ లైట్లు అమర్చాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్లు బీఎస్ లత, టీఎస్ దివాకర్, ఆర్డీవోలు నరసింహ మూర్తి, రాజేశ్వర్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇంజినీర్లు, పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డి మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా..?



జగిత్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

- ఆయనకు మతిభ్రమించింది
- వయసు మళ్లి ఏదేదో మాట్లాడుతున్నడు
- గౌరమ్మ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీక
- ఆ దైవం స్థానంలో విస్కీ బాటిల్ పెడతారంటావా..?
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై జడ్పీ చైర్‌పర్సన్ వసంత ఫైర్

జగిత్యాల, అక్టోబర్ 19: 'కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి వయసు మళ్లి, మతి గతి తప్పింది. మద్యం తాగిన వ్యక్తి వలె ఏదోదే మాట్లాడుతున్నడు. ఎమ్మెల్సీ కవితపై వ్యంగ్యంగా మాట్లాడడం ఆయన స్థాయికి తగదు' అని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా.. అంటూ ప్రశ్నించారు. గౌరమ్మను అవమానించిన జీవన్ రెడ్డి పల్లెల్లో, వార్డుల్లోకి వచ్చినప్పుడు మహిళా సోదరీమణులు నిలదీయాలని కోరారు. వెంటనే భేషరతుగా ఎమ్మెల్సీ కవితకు జీవన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలా అవాకులు, చవాకులు పేలితే ఆయన వయసుకు కూడా విలువ ఇవ్వకుండా ఎదురుదాడికి దిగుతామని హెచ్చరించారు. జగిత్యాల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఒక మహిళా ప్రజాప్రతినిధిపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతిక అయిన బతుకమ్మతో పాటు, దైవంగా భావించే గౌరమ్మను అవమానించేలా ఆయన మాట్లాడడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని, జగిత్యాలలో బీఆర్ఎస్ జోరును చూసి జీవన్ రెడ్డికి భయం పట్టుకున్నదని, దిమ్మ దిరిగి మైండ్ బ్లాంక్ అయి ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'రాను రాను రాజు గుర్రం ఏదో అయ్యింది' అన్నట్లుగా జీవన్ రెడ్డి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. నీ బిడ్డ వయసున్న ఆడబిడ్డ, సహచర మహిళా ప్రజాప్రతినిధి అయిన ఎమ్మెల్సీ కవితను వ్యంగ్యంగా మాట్లాడడం ఆయన రాజకీయ నైతికతకు, అనుభవానికి తగదన్నారు. గత ఎన్నికల్లో జగిత్యాలలో క్లీన్ బౌల్డ్ చేశారనే భయం, ప్రస్తుతం గెలుస్తానా..? లేదా..? అనే ఆందోళన, కలవరమే ఆయనను సోయి తప్పేలా చేస్తున్నాయని, అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమైక్యాంధ్ర పాలనలో ఆనాటి సీఎం వైఎస్ఆర్ కాళ్లు ఒత్తుకుంటూ, పదవుల కోసం పెదవులు మూసుకొని కూర్చున్న ఆయన కవితను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. 'తెలంగాణ ఉద్యమంలో మీ కాంట్రీబ్యూషన్ ఏంటో చెప్పాలని జడ్పీ చైర్ పర్సన్ వసంత డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి ఇంట్లోని మహిళలు బతుకమ్మ మధ్యలో మందు బాటిల్ పెట్టి బతుకమ్మ ఆడుతున్నారా..? చెప్పాలని ప్రశ్నించారు. సోనియా, రాహుల్‌కు హెరాల్డ్ పత్రికకు సంబంధించి నోటీసులు వచ్చాయని, మరి సోనియాను హెరాల్డ్ రాణి అని పిలువాలని భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు. నిజామాబాద్ ఎంపీగా కవిత ఓడిపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందని, గెలిచి ఉంటే అభివృద్ధి మరింత ఉండేదని గతంలో పలు ప్రెస్‌మీట్లలో మాట్లాడిన జీవన్‌రెడ్డి, ఇప్పుడు ఏం అభివృద్ధి చేశారని మాట్లాడుతున్నారని, ఆయనది నోరా? మోరా..? అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. ఇక్కడ పట్టణ అధ్యక్షులు గట్టు సతీశ్, మున్సిపల్ చైర్ పర్సన్ గోలి శ్రీనివాస్, అర్బన్ మండల ఎంపీపీ మూలసపు లక్ష్మి, రాయికల్ ఏఎంసీ చైర్ పర్సన్ మారంపెల్లి రాణి సాయి కుమార్, జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్లు సమిండ్ల వాణి శ్రీనివాస్, బద్దం లత జగన్, బాలే లత శంకర్, వొద్దినేని లత రాంమోహన్, సీనియర్ నాయకురాలు వజ్రమ్మ, నాయకులు సత్యం, గంగారెడ్డి ఉన్నారు.

## కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ రావాలని ముడుపు



వచ్చే ఎన్నికల్లో మంత్రి ఈశ్వర్‌కు అత్యధిక మెజార్టీ రావాలని ఆకాంక్షిస్తూ ధర్మపురి నృసింహ స్వామి రెనోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామన్న ఆగ్ర నరసింహస్వామి ఆలయంలో ముడుపు కట్టారు. మంత్రి ఈశ్వర్ కృషితో ధర్మపురి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మరింత అభివృద్ధి చెందాలంటే మరో ఐదేళ్లు ఆయన సేవలు అవసరమని, ఈ క్రమంలోనే స్వామివారికి ముడుపు కట్టినట్లు రామన్న చెప్పారు. **- ధర్మపురి, అక్టోబర్19**